# అన్నాచెల్లెలు

అదొక అడవి. ఆ అడవిలో ఒక కట్టెలు కొట్టేవాడు, వాడి భార్య యిద్దరు పిల్లలతో వుండేవాడు. పిల్లలంటే, ఒక అబ్బాయి ఒక అమ్మాయి. వీరంతా చాలాకాలం సుఖంగా జీవించారు. కానీ కొన్నాళ్ళకు కట్టెలు కొట్టేవాడి భార్య చనిపోయింది. పిల్లలు చాలా చిన్నవాళ్ళు. వాళ్ళను చూడడంకోసమని, మరొకతెను పెళ్ళి చేసుకున్నాడు. తర్వాత రోజులు గడుస్తున్నకొద్దీ వాళ్ళకు కష్టాలు ప్రారంభమయ్యాయి. కట్టెలు కొట్టి అమ్మగా వచ్చిన డబ్బుతో పూట గడవడం కష్టమయిపోయింది. చాలాసార్లు పస్తులుకూడా వున్నారు.

అటువంటి సమయంలో అతడి భార్యకు ఒక ఆలోచన వచ్చింది. అతడితో యిలా చెప్పింది. 'ఈ ఇద్దరు పిల్లల్ని ఎక్కడైనా వదిలేయరాదా, వాళ్ళకి పెట్టే తిండి మనకు మిగులుతుందికదా!' అతడికి తన రెండవ భార్య ఆలోచన వినగానే మతిపోయినంత పని అయ్యింది

'వాళ్ళు నీకు పుట్టిన పిల్లలు కాదు గాబట్టి వాళ్లను వదిలేయమంటావా? వాళ్లను ఏ జంతువులైనా తినేస్తే నీకు హాయిగా వుంటుందనుకుంటాను!' అన్నాడు కోపంగా.

'వాళ్లను కడుపు మాడ్చి చంపడంకంటే అదే నయం' అంది. ఇద్దరూ చాలాసేపు వాదించుకున్నారు. చివరకు భార్య చెప్పినట్టు పిల్లలను దట్టమైన అడవిలో వదిలేసి రావడానికి నిశ్చయించుకున్నాడు.

తల్లిదండ్రుల మాటలన్నీ ప్రక్క గదిలో వున్న అన్నా చెల్లెలు విన్నారు. చెల్లెలు ఏడవడం మొదలుపెట్టింది. అన్న మాత్రం 'వూర్కో, నేను ఒక ఉపాయం చెపుతాగదా!' అన్నాడు.

తల్లిదండ్రులు నిద్రపోయిన తర్వాత అన్నయ్య మెల్లగా పక్కమీదనుంచి లేచి ఇంటి బయటకు వచ్చాడు. ఇంటిముందర తెల్లగా మెరుస్తున్న రాళ్లను తన లాగు జేబులనిండా పోసుకుని ఇంట్లోకి వచ్చి పడుకున్నాడు. 'ఇదంతా ఏమిటి?' అడిగింది చెల్లెలు. 'తర్వాత నీకు తెలుస్తుంది కదా!' అన్నాడు.

మరునటి రోజు ఉదయం భార్యా భర్తలు పిల్లలను తీసుకొని బాగా దట్టంగా వున్న అడవివేపు ప్రయాణం సాగించారు. అలా చాలా దూరం పోయాక ఒకచోట ఆగారు. అన్నయ్య అందరికంటే వెనకగా నడుస్తూ, తన జేబుల్లోని రాళ్లను ఒక్కొక్కటి జారవిడుస్తూ వెళ్ళాడు.

'మీ ఇద్దరూ ఇక్కడే వుండండి. మేం ఇటు వెళ్లి కట్టెలు కొట్టుకొని వస్తాం' అంది సవతితల్లి పిల్లలతో. తండ్రి, సవతితల్లి వెళ్లిపోయారు. పిల్లలు ఇద్దరికీ తెలుసు, వాళ్ళు తిరిగి రారని.

వాళ్ళు నిజంగానే తిరిగి రాలేదు. బాగా



చీకటి పడింది. చెల్లెకు భయమేసింది. 'నేను వున్నాకదా, భయపడకు' అన్నాడు అన్నయ్య. చంద్రుడు ఆకాశంలో బాగా పైకి వచ్చాడు. ఆ వెన్నెలలో అన్నీ బాగా కనిపిస్తున్నాయి. అన్నయ్య తను దారిలో జారవిడిచిన రాళ్లను వెన్నెల్లో బాగా మెరుస్తుండగా చూసాడు. 'ఇవిగో, ఈ రాళ్ళు మన ఇంటికి దారి చూపిస్తాయి' అన్నాడు. ఇద్దరూ ఆ రాళ్ల గుర్తుతో ఇంటికి ఎటువంటి కష్టం లేకుండా చేరుకున్నారు.

సవతితల్లి వీళ్లను చూడగానే ఎంతో ప్రేమ నటించింది. 'అయ్యో, మీరు ఎటు వెళ్లిపోయారు? మీకోసం వెతికి వెతికి ఇంటికి వచ్చాం, మీకోసం ఎంత బాధ పడ్డామో తెలుసా' అంది. పిల్లలు విని వూరుకున్నారు.

మరునటి రోజు పిల్లలు నిద్రపోయిన తర్వాత మళ్ళీ భర్తతో ఇలా చెప్పింది. 'వాళ్ళు తిరిగి వచ్చేశారు చూసావా! ఈసారి వాళ్లను ఇంకా దూరంగా తీసుకెళ్ళి వదిలేద్దాం' అంది.

తెల్లవారిన తర్వాత తల్లిదండ్రులు పిల్లలను మళ్ళీ అడవికి బయలుదేరమన్నారు అన్నయ్యకు విషయం తెలిసిపోయింది. వెంటనే ఇంట్లోకి వెళ్లి రొట్టెల పిండిని జేబుల్లో నింపుకుని బయలుదేరాడు. భార్యాభర్తలు ఈసారి మరింత దూరంగా, దట్టంగావున్న అడవిలోకి తీసుకెళ్లారు. అన్నయ్య మునుపటిలాగే వాళ్ల వెనక నడుస్తూ దారిలో రొట్టెల పిండిని జారవిడుస్తూ వెళ్లాడు.

'ఇప్పుడే వస్తాం, ఇక్కడే వుండండి' అంటూ తల్లి తండ్రి వెళ్లిపోయారు. వాళ్లు తిరిగి రాలేదు. బాగా చీకటిపడింది. కొంతసేపటికి చంద్రుడు ఆకాశంలోకి వచ్చాడు. వెన్నెల ఎక్కువయింది.

అన్నయ్య చెల్లెలు చేయి పుచ్చుకుని బయలుదేరాడు. కానీ అతనికి దారి తెలియలేదు. రొట్టెల పిండి కనిపించలేదు. కొన్నిచోట్ల వాటిని చీమలు తినేశాయి. కొన్నిచోట్ల నేలమీద తేమవల్ల కనపడలేదు. అన్నయ్యకు భయమేసింది. ఇంటికి దారి కనుక్కోవడం కష్టమని తెలిసిపోయింది. అసలే అది చాలా దట్టమైన అడవి. అప్పుడప్పుడూ జంతువుల అరుపులు వినిపిస్తున్నాయి. ప్రతి క్షణం భయపడుతూ



అడవిలో చాలా దూరం అటూ ఇటూ తిరిగారు.

ఒక చెట్టు కొమ్మమీద ఒక అందమైన పక్షి కనిపించింది. దాని రెక్కలు అతి తెల్లగా వున్నాయి. ఆ పక్షి వీళ్లను చూడగానే ఆకాశంలోకి ఎగురుకుంటూ వెళ్లింది. పిల్లలు వెన్నెల వెలుగులో దానిని చూస్తూ పరుగెత్తారు.

ఆ పక్షి అలా వెళ్లి వెళ్లి ఒక ఇంటిమీద ఆగింది. అంత దట్టమైన అడవిలో అదొక్కటే ఇల్లు. పిల్లలు అక్కడకు చేరుకున్నారు. అక్కడ అనేక తినుబండారాలు పెట్టివున్నాయి. వాటిని చూడగానే అన్నాచెల్లెలకు సంతోషమేసింది. గబగబా వాటి దగ్గరకు పరుగెత్తారు. అదే సమయంలో ఒక ముసలిది ఇంట్లోంచి బయటకు వచ్చింది.

'రండర్రా పిల్లలూ! మీకు కావలసినంత తిందురుగాని' అంటూ పిలిచింది. వాళ్లను లోపలకు తీసుకెళ్లింది. వాళ్లను కూర్చోబెట్టి రకరకాల వంటకాలను వడ్డించింది. వాళ్ళు కడుపునిండా తిన్నారు. వాళ్ళు తింటుండగా ముసలిది గమనిస్తూనే వుంది. ఆ ముసలిది ఒక మంత్రగత్తె. అది ఈ పిల్లలను తినడానికి ఎత్తులు వేస్తోంది.

వున్నట్టుండి మంత్రగత్తె అన్న రెక్క పుచ్చుకొని బరబరా ఈడ్చుకెళ్లి ఒక బోనులో వేసి దాని తలుపువేసి తాళం పెట్టేసింది. 'నువ్వు ఇక్కడే వుండాలి. నీకు రోజూ తిండిపెట్టి బాగా బలిసేటట్టు చేస్తాను. అప్పుడు నిన్ను తింటే నాకు కడుపు నిండుతుంది' అని నవ్వింది.

అతడి చెల్లెలితో మంత్రగత్తె ఇలా చెప్పింది 'నీకు వంటకు కావలసినవన్నీ తెస్తాను. మీ అన్నయ్యకు మంచి మంచి వంటకాలు చేసిపెట్టు. వాడు బాగా లావు అవ్వాలి' చెల్లెలు అన్న కోసం ఎంతో ప్రాధేయపడింది. కానీ ముసలిది అతడ్ని వదిలేయడానికి ఒప్పుకోలేదు.

ప్రతిరోజూ చెల్లెలు బాగా వండిపెట్టగా, అన్నయ్య బోనులో వుండి హాయిగా భోంచేసేవాడు. ముసలిదానికి కళ్ళు సరిగా కనిపించవు. బోనులో వున్న అన్నయ్య బాగా లావు అయ్యాడో లేదో తెలుసుకుందామని బోను దగ్గరికి వెళ్లి 'ఏదీ నీ చూపుడువేలు

[ 34వ పేజీ చూడండి ]

# అన్నా-చెల్లెలు

మాస్తాను' అంది. అన్నయ్య బాగానే లావు అయ్యాడు. చూపుడువేలు గనక ముసలిదానికి అందిస్తే, వేలు లావును బట్టి తను లావు ఎక్కినట్టు కనుక్కుని, తనని తినేస్తుంది. గాబట్టి తన వేలు బదులు ఒక బొమికను దానికి అందిస్తాను. అది సన్నగా వుంటుంది కదా! అది చూసి తను లావుయెక్కలేదని భ్రమిస్తుంది అనుకున్నాడు. అనుకున్న విధంగానే అతడు అందించిన బొమికను చేతితో ముట్టుకుని చూసి 'ఇంకా నీ వేలు బొమికలాగే వుంది. ఇంకా కండపట్టలేదు' అంటూ వెళ్ళిపోయింది.

ఇలా చాలారోజులు గడిచాయి. ప్రతిసారి బోనులో నుండి ఎముకను ముసలిదానికి చూపించి 'ఇంకా నేను సన్నగానే వున్నాను' అనేవాడు. కొన్నిరోజులకు ముసలిదానికి ఓపిక పోయింది. 'ఇక నీకోసం కాచుకుని కూర్చోలేను. నువు సన్నగావున్నాసరే, ఇవాళే తింటాను' అంది. అతడ్ని వండటానికి, అతడి చెల్లెలకు పురమాయించింది.

[ 27వ పేజీ తరువాయి]

'పొయ్యి బాగా మండుతోందోలేదో చూడు. ఇప్పుడు వాడిని వండాలి' అంది.

చెల్లెలు భయపడింది. ఇప్పుడే ఎలాగైనా ఇద్దరం తప్పించుకోవాలి అనుకుంది.

'మంట సరిపోతుందోలేదో నాకు సరిగా తెలియడంలేదు. నువ్వు ఒక్కసారి చూడు' అంది చెల్లెలు.

ముసలిది విసుక్కుంటూ పొయ్యికి బాగా దగ్గరగా వెళ్ళి చూసింది. అదే సమయంలో చెల్లెలు ముసలిదానిని పొయ్యిలో పడేట్టుగా బలంగా ఒక్కతోపు తోసింది. ముసలిదానికి మొహం కాలి, ఆ బాధకు తట్టుకోలేక చచ్చింది. చెల్లెలు గబగబా ముసలిదాని బొడ్లో వున్న తాళంచెవి తీసుకుని, బోను తాళం తీసింది. అన్నయ్య బోనులోంచి బయటపడ్డాడు. ఇద్దరూ ఎంతో సంతోషించారు, ముసలిదాని పీడ వదిలినందుకు. ఇద్దరూ ఆ ఇల్లంతా తిరిగి చూసారు. ఒక గదిలో మూల బంగారు, వెండి నాణాలతోపాటు ఎన్నో నగలు కనిపించాయి. ఆ సమయంలో వారికి తమ పేదతనం గుర్తుకువచ్చింది. వాళ్ళు మోయగలిగినంత బంగారం, వెండి నాణాలు, నగలు తీసుకుని ఇంటి బయటకు వచ్చారు. అక్కడ ఈ ఇంటికి దారి చూపించిన తెల్లటి పక్షి కనిపించింది. వీళ్ళను చూడగానే అది ఆకాశంలోకి ఎగిరింది. అది వెళ్ళినవేపే పరుగెత్తుకుంటూ వెళ్ళారు అన్నాచెల్లెలు. అలా వెళ్ళి వెళ్ళి తమ ఇంటి పరిసరాలకు చేరుకున్నారు. ఆ పక్షి మళ్ళీ వెనక్కి వెళ్ళిపోయింది. అన్నాచెల్లెలు ఇంటికి వెళ్ళి తలుపు తట్టారు. తల్లిదండ్రులు వీళ్ళను చూసి కౌగలించుకుని, తమని క్షమించమని అడిగారు. తర్వాత అందరూ హాయిగా వున్నారు.

— బాబు ★

# విలువ

ఓ దేవుడా
ఎందుకు పుట్టించావు బీదరికంలో
అయినా భరిస్తున్నాను.
మనిషికి మనిషికి మధ్య గల
తారతమ్య లోకంలో.
నా నివాసపు ప్రదేశాలు
ఎండాకాలం చెట్టుక్రింద
వానాకాలం బ్రిడ్జిక్రింద
జీవించటానికి చాలు పట్టెడు మెతుకులు.
నాకున్నాయి హక్కులు
ప్రతి ఇంటివద్ద అడుక్కోటానికి
ప్రతి మనిషిని అడుక్కోటానికి
ఉన్నాయి నాకు విలువలేని హక్కులు.
పట్టెడు మెతుకులు
భరించలేదు ఈ లోకం
విలువ లేని నా కోసం
కానీ అర్థిస్తోంది ఈ లోకం
విలువ కలిగిన నా ఓటు కోసం.

— మాదపాటి భాస్కరరావు

